# మంచిదారి

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు,
సికింద్రాబాద్



రాజు, శ్రీను ఏడవ తరగతి చదువుతున్నారు. వారిద్దరు మంచి స్నేహితులు.

రాజు ఏ రోజు పాఠాలు ఆ రోజు తరగతిలో మాస్టారు చెప్పేది శ్రద్ధగా వినడమే కాకుండా ఇంటికొచ్చి చదువుకునేవాడు. శ్రీను మాత్రం పాఠశాల నుండి రాగానే పుస్తకాల సంచి ఇంట్లో పడేసి ఆడుకోవడానికి పరిగెత్తేవాడు. 'చదువు పట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదని. ఎప్పటికప్పుడు చక్కగా చదువుతూంటే, సంవత్సరాంతమున జరిగే పరీక్షల్లో ఉత్తీర్ణత పొందవచ్చనీ' రాజు ఎన్నోసార్లు శ్రీనుకు నచ్చ చెప్పేవాడు కానీ శ్రీను వింటేగా.

వాళ్ళిద్దరూ రోజూ బడికెళ్ళే

మార్గంలో ఆంజనేయస్వామి గుడి వుంది. అక్కడ కూడా రాజు ఆంజనేయ దండకం చదివి, అయ్యగారిచ్చే తీర్థప్రసాదాలు భక్తిగా తీసుకుంటే, శ్రీనుమాత్రం ఏదో మొక్కుబడిగా దణ్ణం పెట్టుకునేవాడు. 'భగవంతుణ్ణి మనస్ఫూర్తిగా, భక్తితో ప్రార్థిస్తేనే, కృప కలుగుతుందని రాజు చెప్పేవాడు. అయినా శ్రీను పెడచెవిన పెట్టేవాడు.

అలా రోజులు గడుస్తూ సంవత్సరాంతపు పరీక్షలు రానే వచ్చాయి.

ఇద్దరూ బడికెళుతున్నప్పుడు దారి మధ్యలో కొద్దిగా విరిగిపోయిన పెన్ను కనిపించింది. రాజు దాన్ని కళ్ళకద్దుకుని జేబులో పెట్టుకున్నాడు. అది చూసి శ్రీను నవ్వుతూ.. 'ఆ విరిగిపోయిన చెత్త పెన్ను ఎందుకురా, అవతల పడేయ్' అన్నాడు. రాజు నవ్వి ఊరుకున్నాడు.

సాయంత్రం వస్తున్నప్పుడు రాజు "శ్రీనూ, ఇవాళేమైందో తెలుసా? పరీక్ష రాస్తుంటే నా పెన్ను పాడైపోయింది. సమయానికి నాకు దొరికిన పెన్నుంది కాబట్టి రాయగలిగాను. అది నాకు ఆ భగవంతుడే ఇచ్చాడు!" అన్నాడు భక్తితో.

"సర్లే, నా పెన్ను రాయడంలో చాలా ఇబ్బంది పెట్టింది. అంతేకాదు పరీక్షలోని ప్రశ్నలు చాలా కష్టంగా వున్నాయి. నేను ఉత్తీర్ణుడవను. అయినా నేనూ నీతో పాటు గుడికొస్తాను కదా! అయినా దేవుడు నా కెందుకు మేలు చేయలేదు" ఉక్రోషంగా అన్నాడు.

"ఎందుకు చేయలేదు..? చేశాడు. నా లాంటి స్నేహితుడిని నీకిచ్చి నా ద్వారా ప్రతిక్షణం నిన్ను హెచ్చరించేవాడు. నువ్వు వింటేగా, దేవుడు మంచిదారి చూపిస్తాడు. నడవాల్సింది మనం.." అన్నాడు.

అప్పటి నుండి శ్రీనులో మంచి మార్పు వచ్చింది. చేసే ప్రతి పనిని శ్రద్ధగా, ఓపికగా చేసి ఉత్తముడయ్యాడు.

## జాతీయ చిహ్నాలు

'నెమలి' అందం చూడరా
'పులి' అరుపులు వినరా
'రావిచెట్టు' గుబురురా
'తామరపువ్వు' చిన్నదిరా
'మామిడిపండు' తినరా
'హాకీ' ఆడరా
'హిందీ' పాఠం చదవరా
'జనగణమన' పాడరా
అవన్నీ మనకురా
'జాతీయ చిహ్నాలు'రా

– దార్ల బుచ్చిబాబు